యిపు డెందు బోయెదే - యిభరాజగమన
కనుక సంతోషమ్ము - గానుండ తగును
ఓడక వచ్చి నా - యొద్ద గూర్చుండు
మన మతి సిగ్గన - వనిత సుభద్ర”
మగువ తా దివ్వెల - మాటుకే చనెను
కొనలు నిక్కగ వేయు - కుసుమాస్త్రములన
బొమలు నిక్కగ వల - పుల చూపు చూచె
అల మోహనాంగుడు - న్నటుఁ జూచె దెలిసి
లజ్జించి దిగ్గన - రమణి శోషించె
నిబ్బరితనమున - నెలత చెయివట్టి
అబ్బురమ్మున కౌగి - టదుముకొని తెచ్చె
తొయ్యలిని తొడలపై - నెయ్యమున నునిచి
పొన్నపువ్వులదండ - పొలతికి జుట్టె
కుంకుమగంధమ్ము - కోమలి కలది
బంగారు సురటి చే - పట్టి కిరీటి
అంగనకు విసిరె - నతిముదమ్మునను
ప్రాణేశు పాదములు - పణతి తగ నొత్తె
“యెల్ల లోకమ్ములు - నేలిన యట్టి
వల్లభుతోడనె - వనిత పుట్టితిని
నీ పాదములసేవ - నే జేయవలెను
మా పాదముల నొత్త - మగువ నీ కేల
యంతటి వాడైన - యా గజేంద్రుండు
మావటీనికి క్రింద - మణిగుండ లేదు
పురుషోత్తములతోన - పుట్టితివి గనుక
బుద్ధులకు కొదవటే - పొలతిరొ నీకు”



అనుచు తేనియబోలు - నతివప ల్కాని
పానకంబులు త్రాగి - పం డ్లారగించి
కర్పూర వీడెములు - కడు నర్థి జేసె
అటు మేను లుప్పొంగె - ఆ దంపతులకు
తలపులు పులకించె - నెలతకుం బతికి
ఆ సుభద్రాదేవి - ఆ యర్జునుండు
సంతోషమున నుండ్రి - సర్వకాలమ్ము
అవనిలో తాళ్లపా - కన్నయ్యగారి
తరుణి తిమ్మక చెప్పె - దాను సుభద్ర
కల్యాణ మను పాట - కడుమంచి తేట
పలుకుల, నీపాట - పాడినా విన్న
శ్రీహరి వారికి - చేరువై యుండు
నానాట పాపములు - నాశనం బౌను
ఆప్తులు బంధువు - లను వృందగలరు
సప్త సంతానములు - సమకూర గలవు.

**సంపూర్ణము**